

నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలకు సర్ది చెబుతున్న పోలీసులు

# బీర్లకు నిరసన సెగ

మోటకొండూర్, జూన్ 9: మోటకొండూర్ మండల కేంద్రానికి సోమవారం ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు నిరసన సెగ తగిలింది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువవికాస్, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు ఆ పార్టీ కార్యకర్తలకే వస్తున్నాయని మోటకొండూర్ బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. ఈ ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులకు తప్ప బలహీన వర్గాలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. ప్రభుత్వ పథకంలో ఏది చూసినా కాంగ్రెస్ పార్టీ వారికి వచ్చాయని చెప్పారు. వెంటనే ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని నిలదీశారు. పరిస్థితి గందరగోళంగా మారడంతో పోలీసులు కలుగజేసుకుని సర్ది చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోతుందని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ ఈ సందర్భంగా అన్నారు. అభివృద్ధిపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే గొంతు నొక్కుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ, నాయకులు బొట్ల నర్సింహ, జీవిలికపల్లి వెంకటేశ్, లింగం, బొట్ల పాండు, బొట్ల మహేశ్, బాల ఐలయ్య, దడిగే మధు, నల్ల జహంగీర్, నక్కిర్త ఉప్పలయ్య, పల్లపు మధు, వంగపల్లి సురేశ్, బొట్ల నవీన్, వడ్డెబోయిన శ్రీనివాస్, బొట్ల ప్రశాంత్, నాంపల్లి బాలకృష్ణ తదితరులు ఉన్నారు.



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శ వడ్డెబోయిన వెంకటేశ్

# రజకులపై వేధింపులు ఆపాలి

### రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్

యాదగిరిగుట్ట, జూన్ 9: రజక వృత్తిదారుల ఉచిత విద్యుత్ పథకంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న కరెంట్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలని, విద్యుత్ అధికారులు వేధింపులు తక్షణమే నిలిపివేయాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శ వడ్డెబోయిన వెంకటేశ్ డిమాండ్ చేశారు. రజకుల విద్యుత్ బకాయి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆధునిక ధోబీఘాట్‌లు నిర్మించాలని కోరుతూ ఈ నెల 17న ఇందిరాపార్కు ముందు మహాధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం పట్టణంలోని మహాధర్నా కరపత్రాలు ఆవిష్కరించి, పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు లక్ష మందికిపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, దీని ద్వారా వృత్తిదారులు ఉపాధి పొందుతున్నారని అన్నారు. గత యేడాది ఉచిత విద్యుత్ పథకానికి రజకులకు రూ. 187 కోట్లు పెండింగ్ బకాయి బిల్లులు ఉన్నాయని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించలేదన్నారు. రజకులు బిల్లులు చెల్లించాలని విద్యుత్ శాఖ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు స్వామి, బాలరాజు, సహాయ కార్యదర్శి రవి, జిల్లా కమిటీ సభ్యుడు రమేశ్, శంకరయ్య, లక్ష్మి పాల్గొన్నారు.



## • బీఆర్ఎస్‌వీ నాయకుల ముందస్తు అరెస్ట్



సూర్యాపేటలో మంత్రుల పర్యటన సందర్భంగా జాబ్ క్యాలెండర్ గురించి నిలదీయడానికి బయలుదేరిన బీఆర్ఎస్‌వీ నాయకులను తిరుమలగిరి, పెన్‌పహాడ్‌లలో పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో త్రిశూల్, జగన్, సోమేశ్వర్, విష్ణు, అర్జున్, శోభన్‌బాబు, వర్మ, సందీప్, నవీన్, హరీశ్, బబ్లూ ఉన్నారు. పెన్‌పహాడ్‌లో బంటు సందీప్‌నూ అరెస్టు చేశారు. – తిరుమలగిరి, పెన్‌పహాడ్



# ఆధిపత్య పోరు.. ఆశలు ఆవిరి

మంత్రులపైనే అనుమానాలు

## జిల్లా నేతలకు దక్కని పదవులు

## రాజగోపాల్‌రెడ్డికి మొండి 'చెయ్యి' • బాలునాయక్ ఆశలపై నీళ్లు

## తీవ్ర అసంతృప్తిలో ఇద్దరు నేతలు • పార్టీ పెద్దలు మాట తప్పారని అసహనం

**ఉమ్మడి జిల్లాకు మరో మంత్రి పదవితో పాటు డిప్యూటీ స్పీకర్ పదవి ఖాయమంటూ కొంతకాలంగా నెలకొన్న ఊహాగానాలకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తెరదించింది. ఆదివారం చేపట్టిన మంత్రివర్గ విస్తరణలో జిల్లా నుంచి కొత్తగా ఎవరికీ స్థానం కల్పించలేదు. మంత్రి పదవిపై గంపెడాశలతో ఎదురు చూస్తున్న రాజగోపాల్‌రెడ్డికి పార్టీ మొండిచెయ్యి చూపగా ఎస్టీ సామాజిక వర్గం నుంచి మంత్రి పదవిని ఆశించిన దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌కు కూడా నిరాశే మిగిలింది. దీనంతటికీ జిల్లా పార్టీలోని ముఖ్యుల మధ్య ఉన్న ఆధిపత్య పోరే కారణమన్న చర్చ జోరుగా సాగుతున్నది.**


నల్లగొండ ప్రతినిధి, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఇప్పటికే మంత్రివర్గంలో ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు మంత్రులుగా కొనసాగుతున్నారు. అయితే తర్వాత విస్తరణలో తనకు తప్పకుండా మంత్రి పదవి వస్తుందన్న ఆశతో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఇప్పటివరకు నెట్టుకొచ్చారు. దీనికి ఎంపీ ఎన్నికల సమయంలో పార్టీ అధిష్టానం ఇచ్చిన హామీ ప్రతిపాదికగా ఉంది. ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని అప్పట్లో పార్టీ అధిష్టానం చెప్పినట్లుగా రాజగోపాల్‌రెడ్డి పలు సందర్భాల్లో పేర్కొన్నారు. అందుకే సొంతంగా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఎంపీ చామల కిరణ్ గెలుపులో రాజగోపాల్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు. దీంతో ఇక అప్పటి నుంచి తనకు ఎప్పుడు విస్తరణ జరిగినా మంత్రి పదవి ఖాయమన్న ధోరణిలో ఉన్నారు. పలు సందర్భాల్లో తన అనుచరులతో పాటు మునుగోడు నియోజకవర్గంలోనే ఇదే విషయాన్ని బహిరంగంగానూ ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఖాయమన్న ధీమాను ఆయన అనుచరులు వ్యక్తం చేస్తూ వచ్చారు. కానీ తీరా పార్టీ అధిష్టానం మాత్రం తాజా విస్తరణలో ఆయనకు చోటు ఇవ్వలేదు. కేవలం ముగ్గురితోనూ సరిపెడుతూ అది కూడా ఎస్సీ సామాజికవర్గం నుంచి ఇద్దరికీ, బీసీల నుంచి ఒక్కరికీ మాత్రమే కొత్తగా మంత్రి పదవులు కట్టబెట్టింది. దీంతో రాజగోపాల్‌రెడ్డితో పాటు ఆయన అనుచరులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. పార్టీ అధిష్టానంతో పాటు రాష్ట్ర ముఖ్య నేతలు సైతం నమ్మక ద్రోహానికి పాల్పడుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందువల్లనే ఆదివారం తెల్లవారుజాము నుంచే రాజగోపాల్‌రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు సమాచారం. ఉదయం నుంచి సాయంత్రం వరకు పార్టీ ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌తో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి గడ్డం వివేక్‌లకు సైతం ఎన్నిమార్లు ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు. చివరకు సాయంత్రం దాటాక మీనాక్షీ నటరాజన్, మంత్రి వివేక్‌లు రాజగోపాల్‌రెడ్డిని కలుసుకోగలిగారు. వారు ఎంత బుజ్జగించినా రాజగోపాల్‌రెడ్డి ససేమిరా అంటూ తనకు ఇచ్చిన హామీ నెరవేర్చాల్సిందేనని పట్టుబట్టినట్లు తెలిసింది. పార్టీ అధిష్టానం మాట ఇచ్చి తప్పడం ఏంటని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మిగిలిన మూడు మంత్రి పదవుల్లోనైనా అవకాశం కల్పించాల్సిందేనని రాజగోపాల్‌రెడ్డి తేల్చిచెప్పినట్లు తెలిసింది. లేదంటే తన దారి తాను చూసుకోవాల్సి వస్తుందని ఘాటుగానే హెచ్చరించినట్లు ఆయన అనుచరుల్లో చర్చ జరుగుతున్నది.

### డిప్యూటీ స్పీకర్ కూడా లేదు...

మంత్రివర్గంలో ఎస్టీ లంబాడీ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లేకపోవడంతో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ గట్టి ఆశలు పెట్టుకున్నారు. అయితే ఉమ్మడి జిల్లా నుంచి రాజగోపాల్‌రెడ్డి కూడా మంత్రి పదవిపై గట్టి ప్రయత్నాల్లో ఉండగా ఆయనకు ఇస్తే తనకు రాదన్న అంచనాతో బాలునాయక్ ఉన్నారు. ఇదే జరిగితే తనకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇస్తామని పార్టీ పెద్దలు చెప్పినట్లు పలు సందర్భాల్లో బాలునాయక్ ప్రకటించారు. తాజా విస్తరణలో తనకు మంత్రి పదవి రాకున్నా డిప్యూటీ స్పీకర్ పదవి ఖాయమని ఆదివారం ఉదయం వరకు బాలునాయక్ ధీమాతో ఉన్నట్లు ఆయన సన్నిహితులు పేర్కొన్నారు. తీరా రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఓ సారి జెడ్పీ చైర్మన్‌గా గెలిచిన బాలునాయక్‌ను కాదని మహబూబాబాద్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన రాంచంద్రునాయక్ వైపు పార్టీ మొగ్గు చూపడం షాక్‌కు గురిచేసింది. బాలునాయక్ సైతం ఏమీ మాట్లాడలేని పరిస్థితి. జిల్లాకు చెందిన ముఖ్యులే తనకు పదవి దక్కకుండా అడ్డుపడ్డారని భావిస్తున్నట్లు అనుచరులు పేర్కొంటున్నారు.

### జిల్లా మంత్రులే అడ్డుకున్నారని ఆగ్రహం

జిల్లాకు చెందిన మంత్రులు మరో మంత్రి పదవితో పాటు డిప్యూటీ స్పీకర్ పదవికి అడ్డుపడినట్లుగా కాంగ్రెస్ పార్టీలో చర్చ సాగుతున్నది. రాజగోపాల్‌రెడ్డి విషయంలో ఆది నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యక్షంగా, తన సోదరుడు వెంకట్‌రెడ్డి పరోక్షంగా అడ్డుపడుతున్నట్లు ఆయన అనుచరులు, సన్నిహితులు భావిస్తున్న విషయం తెలిసిందే. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి వస్తే తనకు ఉన్న ఆర్థిక హార్థిక శక్తులతో ఉమ్మడి జిల్లాలో తమ ప్రాబల్యం తగ్గిపోతుందన్న భయంలో ఇద్దరూ మంత్రులు ఉన్నట్లు చర్చ జరుగుతున్నది. ఒకవేళ మంత్రి పదవి వస్తే ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేల్లో మెజారిటీ ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డికి దగ్గరగా వ్యవహరిస్తారని కూడా భావిస్తున్నట్లు సమాచారం. వీటన్నిటి నేపథ్యంలోనే రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి రాకుండా అడ్డుపడుతున్నట్లుగా రాజగోపాల్ సన్నిహితులు, కాంగ్రెస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ఇక ఇదే సమయంలో బాలునాయక్‌కు సైతం డిప్యూటీ స్పీకర్ పదవి ఇస్తే ప్రొటోకాల్ పరంగా మంత్రులతో సమానంగా జిల్లాలో వ్యవహరించడానికి అవకాశం ఉన్నది. ఈ పరిణామాలు సాధారణంగానే ప్రస్తుత మంత్రులు ఇష్టపడరని, అందుకే డిప్యూటీ స్పీకర్ పదవి కూడా జిల్లా నుంచి పక్క జిల్లాకు తరలిపోయేలా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



విద్యుత్ శాఖలో అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన పనుల కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంప్రూవ్‌మెంట్ బడ్జెట్ నేటికీ మంజూరు కాలేదు. దీంతో మరమ్మతులు చేసేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కనీసం అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు ఓ విద్యుత్ స్తంభం వేయాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ దాదాపు రూ.60 కోట్లతో ఇండెంట్ పంపించి రెండు నెలలు గడిచినా నేటికీ అతీగతీ లేకుండా పోయింది. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఏనాడూ ఇలాంటి పరిస్థితి లేదని ఆ శాఖ ద్వారా తెలిసింది.

# కరెంటోళ్ల ఖజానా ఖాళీ!

- మంజూరు కాని ఇంప్రూవ్‌మెంట్ బడ్జెట్
- ఇండెంట్‌పెట్టి రెండు నెలలైనా అతీగతీ లేదు

సూర్యాపేట, మే 9 (నమస్తే తెలంగాణ): పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో వెలుగులు వెలిగిన విద్యుత్ శాఖ నేడు చీకట్లు అలుముకుంటున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ సరఫరా ఓ పీడకలగా ఉండేది. కరెంటు కోసం అనేక కష్టాలు పడాల్సివచ్చేది. తెలంగాణ ఏర్పాటు అనంతరం అభివృద్ధికి నీళ్లు, విద్యుత్ మూలంగా భావించిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ రెండు రంగాలకు అధిక మొత్తంలో నిధులు కేటాయించడంతో దేశంలోనే తెలంగాణ జీడీపీ రికార్డు స్థాయిలో పెరిగిన విషయం తెలిసిందే.


### నిరంతర విద్యుత్‌కు మంగళం..

ప్రధానంగా విద్యుత్ విషయానికి వస్తే రైతులతో పాటు అన్ని రంగాలకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేసింది. దీని కోసం రూ. వేల కోట్లు వెచ్చించి అవసరమైన విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తదితర కావాల్సిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేసింది. ఎన్నికల సమయంలో హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. నేటికీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదు. ఇదే క్రమంలో కోతలతో వ్యవసాయం, గృహావసరాలకు నిరంతర విద్యుత్‌కు మంగళం పాడింది.

### నెలలు గడిచినా నిధుల జాడేది?

ప్రతి ఆర్థిక సంవత్సరం ఆయా జిల్లాలకు విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఇంప్రూవ్‌మెంట్ నిధులు విడుదల చేస్తారు. కానీ మార్చితో ఆర్థిక సంవత్సరం ముగిసి రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదు. సాధారణంగా ప్రతి ఏడాది మార్చి నెలాఖరులోనే ఆయా జిల్లాల నుంచి ఇంప్రూవ్‌మెంట్ బడ్జెట్ కోసం ఎస్‌పీడీసీఎల్‌కు ఇండెంట్ పంపించడం, ఆ తర్వాత అక్కడి నుంచి ప్రభుత్వానికి వెళ్తుంది. ఈ నిధులను అవసరానికి అనుగుణంగా విడతల వారీగా విడుదల చేస్తారు. వీటితో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, మిడిల్ పోల్స్, డ్యామేజీ పోల్స్, ఇంటర్ లింక్ లైన్స్ తదితర లోఓల్టేజీ నివారణకు కావాల్సిన చర్యలు చేపడుతారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వీటి కోసం ప్రతి సంవత్సరం ఏప్రిల్ మొదటి వారంలోనే బడ్జెట్ వచ్చేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల నుంచి దాదాపు రూ.60 నుంచి 65 కోట్లతో ఇండెంట్ పెట్టినట్టు సమాచారం. సూర్యాపేటలో రూ.15 నుంచి రూ.20 కోట్లు, నల్లగొండలో రూ.35 నుంచి రూ.40 కోట్లు ఉండగా.. యాదాద్రి భువనగిరి జిల్లాలో రూ.10 నుంచి రూ.12 కోట్లు అవసరమని ఇండెంట్ పంపగా.. ఇప్పటి వరకు ఎలాంటి నిధులు విడుదల కాకపోవడం గమనార్హం. దీంతో ఎక్కడైనా అత్యవసర పనులు ఉంటే ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా కొన్నింటిని కాంట్రాక్టర్లను రిక్వెస్టు చేయించడం.. మరి కొన్నింటిని వాయిదా వేయడం చేస్తున్నారు. ప్రస్తుతం మూడు జిల్లాల్లో కలిపి దాదాపు 250కి పైనే లోఓల్టేజీ సమస్యలతో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాల్సి ఉండగా.. అవి పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తున్నది. అలాగే చాలా చోట్ల విద్యుత్ సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం నిధులు విడుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### చదువుల సాగుకు విద్యాశాఖ సమాయత్తం..!




రామగిరి, జూన్ 9: 2025-26 విద్యా సంవత్సరం ఈ నెల 12 నుంచి ప్రారంభం అవుతుండగా పాఠశాలల్లో బడి గంట మోగనున్నది. బడులు తెరుచుకుని విద్యార్థులు ప్రవేశించగానే వారికి పాఠ్య, నోట్, వర్క్ బుక్స్ అందించేలా జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకుంటున్నది. మరో వైపు బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలతో ఈ నెల 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. నూతన ఒరవడితో ప్రభుత్వ విద్య బలోపేతానికై ఉపాధ్యాయులు ముందుకు సాగుతుండటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వివిధ యాజమాన్యాల పరిధిలో 2,065(ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్స్) పాఠశాలలు ఉండగా 2,34,502 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అన్ని మండలాల్లో ఉన్న వివిధ యాజమాన్యాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్య, నోట్, వర్క్ పుస్తకాలు జిల్లా బుక్ డిపో నుంచి మండల విద్యాశాఖాధికారి కార్యాలయాలకు అక్కడ నుంచి పాఠశాలలకు చేర్చారు. జిల్లాలో 1,606(ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ) ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు 5,89,970 పాఠ్యపుస్తకాలు అవసరం ఉండగా 4,90,860 పాఠ్యపుస్తకాలు వచ్చేశాయి. విద్యార్థులకు పుస్తకాలతోపాటు యూనిఫామ్‌లు అందించనున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మౌళిక వసతులు ఏర్పాటు చేస్తూ పాఠశాలలు స్వాగతం పలుకనున్నాయి. ప్రతి పాఠశాల పరిధిలో ఈ నెల 12, 13న బడిబాట సమన్వయ సమావేశాలు నిర్వహించనున్నారు. 14 నుంచి 5 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.




సూర్యాపేట ఆర్టీసీ డిపోలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

# ఆర్టీసీలో సమూల మార్పులు

## పర్యావరణ పరిరక్షణకు కృషి : ఉప ముఖ్యమంత్రి భట్టి

సూర్యాపేట అర్బన్, జూన్ 9: మహాలక్ష్మీ పథ కం ద్వారా ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తున్నదని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం సూర్యాపేట బస్ డిపోలో ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మాట్లాడారు. కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడేందుకు ఆర్టీసీ సంస్థ ముందుకెళుతుందన్నారు. పొన్నం ప్రభాకర్ రవాణాశాఖ మంత్రి అయిన నాటి నుంచి ఆర్టీసీలో సమూల మార్పులు తెచ్చి అనేక సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు. పాత బస్సులు, డీజిల్ బస్సులను పక్కకు పెట్టి ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా వాతావరణాన్ని కాపాడుతున్నామన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు సూర్యాపేట డిపోకు 79బస్సులు మంజూరు కాగా 45 బస్సులను ప్రారంభించామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలో ఆడపడుచులకు 182 కోట్ల జీరో టికెట్లు జారీ చేశామన్నారు. తెలంగాణ ఆడపడుచులు రూ.6,088 కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారని చెప్పారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో మారుతున్న కాలానికి అనుగుణంగా కార్మికుల సంక్షేమాన్ని కోరుకుంటూ సూర్యాపేట డిపో నుంచి హైదరాబాద్, నల్లగొండ, ఖమ్మం, వరంగల్, కోదాడ వంటి ప్రాంతాలకు 79 ఎలక్ట్రికల్ బస్సులు మంజూరు చేశామన్నారు. అందులో 45 బస్సులు ప్రారంభించామన్నారు. నల్లగొండలో చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేసి బస్సులు మంజూరు చేస్తామన్నారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్యం నుంచి వాతావరణాన్ని కాపాడేందుకు కాలుష్య రహిత ఎలక్ట్రిక్ బస్సులు నడుపుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్పీ కే నరసింహ, ఎమ్మెల్యేలు మందుల సామేల్, నలమాద పద్మావతిరెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ మెంబర్ చెవిటి వెంకన్నయాదవ్, సూర్యాపేట మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉపేషాఖాన్, వెంకన్న, జేబీఎం సంస్థ ప్రతినిధి ప్రభాకర్, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట ఆర్టీసీ డిపోలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభిస్తున్న మంత్రులు